ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 13 జనవరి 2024

20న నవోదయ ప్రవేశ పరీక్ష

కలెక్టరేట్, జనవరి 12: జవహర్ నవోదయలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు గాను ఈ నెల 20న పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో 7,573 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 20న ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. సమీక్షలో డీఈవో వెంకటేశ్వరరావు, నవోదయ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఇప్పటికైతే సేఫ్!

- సంక్రాంతి తర్వాత ఏమవుతుందో?
- ఆ మూడు నియోజకవర్గాలపై వెల్లడికాని వైసీపీ నిర్ణయం
- నాలుగో జాబితాలో 'మార్పు' తప్పదంటున్న సంకేతాలు
- స్వపక్షంలోనే పెరిగిన అసమ్మతి స్వరం









(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

"హమ్మయ్య.. ఇప్పటికి సేఫ్. గౌరవానికి ఢోకాలేదు. అంతగా బాధపడాల్సిన అవసరం లేదు." ఇదీ అధికార పార్టీలోని ఓ ముగ్గురు ఎమ్మెల్యేల మనసులో మాట. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చుతూ వైసీపీ అధిష్ఠానం గురువారం రాత్రి మూడో జాబితా విడుదల చేసింది. అందులో జిల్లాకు సంబంధించి ఓ మూడు నియోజకవర్గాల జోలికి పోలేదు. దీంతో ఆయా ఎమ్మెల్యేలు ప్రస్తుతానికి ఊరట చెందినా.. లోలోపల మాత్రం గుబులుగానే ఉన్నారు. సంక్రాంతి తర్వాత అధిష్ఠానం నాలుగో జాబితా విడుదల చేయనుండడంతో.. తమ భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

● ఎచ్చెర్లలో పెరిగిన అసమ్మతి

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పై సొంత పార్టీ నేతల్లో అసమ్మతి అధికంగా ఉంది. స్వపక్షంలో విపక్షంలా వర్గ పోరు వెంటాడుతోంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ అసమ్మతి పెంచారు. ఆ తీవ్రత తాడేపల్లికి చేరేలా ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ కిరణ్‌కుమార్‌కు టిక్కెట్ ఇవ్వొద్దని.. ఇస్తే ఓడిస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు. జాబితాలు సిద్ధమవుతున్న వేళ అసమ్మతి పోరు ఎమ్మెల్యే కిరణ్ గుండెల్లో గుబులు రేపుతోంది. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్.. ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంపై కన్నువేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్తిబాబు, విజయనగరం జిల్లాలో వైసీపీలో కీలకంగా మారిన చిన్న శ్రీను ఆశీస్సులు కూడా ఎంపీ చంద్రశేఖర్‌కు మెండుగా ఉన్నాయి. దీంతో ఎచ్చెర్లలో పెరుగుతున్న అసమ్మతిని సాకుగా చూపించి.. అసెంబ్లీ బరిలో తన పేరు ఉండేలా ఎంపీ చంద్రశేఖర్ విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అధిష్ఠానం త్వరలో విడుదల చేయనున్న నాలుగో జాబితాలో ఎచ్చెర్ల అసెంబ్లీలో అభ్యర్థి విషయమై స్పష్టత ఇవ్వనుంది. అయితే తనకే ఎచ్చెర్ల అసెంబ్లీ సీటు ఖాయమని.. నియోజకవర్గాల ఇన్‌చార్జిల మార్పు ఉండబోదని ప్రస్తుత ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌బహిరంగంగా చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది.

● పాతపట్నంలోనూ అదే పరిస్థితి

పాతపట్నం నియోజకవర్గంలోనూ ఎచ్చెర్ల మాదిరి పరిస్థితి నెలకొంది. సొంత పార్టీలోనే ఎమ్మెల్యే రెడ్డిశాంతిపై అసమ్మతి, వర్గ పోరు తీవ్రంగా ఉంది. 'స్థానికులకు మాత్రమే టిక్కెట్ కేటాయించాలి. అలా అయితేనే సహకరిస్తాం. మేము సూచించిన వారికి టిక్కెట్ ఇస్తేనే గెలిపిస్తాం. స్థానికేతరులకు మళ్లీ టిక్కెట్ ఇస్తే సహకరించం' అని వైసీపీలో మరో వర్గం నాయకులు అధిష్ఠానానికి తేల్చి చెప్పేస్తున్నారు.

● ఆమదాల వలసలో వర్గపోరు

ఆమదాల వలస నియోజక వర్గంలోని వైసీపీలోనూ వర్గపోరు అధికమే. ఇక్కడ నుంచి స్పీకర్ తమ్మినేని సీతారాంతో పాటు మరో ముగ్గురు టిక్కెట్ ఆశిస్తున్నారు. తాడేపల్లి వెళ్లి అధిష్ఠానాన్ని కూడా కలిసి వచ్చారు. ఇక్కడి పార్టీ పరిస్థితులు, సర్వేలు, కీలక విషయాలను సీఎం జగన్‌కు చేరవేసినట్లు తెలిసింది. బహుశా.. ఆమదాలవలసలో తమ్మినేని సీతారాం కాకుండా మరో అభ్యర్థిని మార్పు చేస్తే.. టీడీపీ గెలుపు మరింత సులభంగా ఉంటుందని.. సర్వేల ద్వారా వెల్లడైన విషయం కంటే.. అభ్యర్థిని మార్పు చేయకపోవడమే కాసింత బెటర్ అధిష్ఠానం నిర్ణయించినట్టు వైసీపీ స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఏదేమైనా మరో వారం రోజుల్లో ఈ మూడు నియోజకవర్గాల అధికార పార్టీనేతలకు.. టిక్కెట్ ఖరారు విషయమై అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని చర్చనీయాంశమవుతోంది.

● ఫలించని బుజ్జగింపులు

అభ్యర్థులను మార్పు చేయాలని రెండేళ్ల నుంచి అసమ్మతి స్వరం పెరుగుతూనే ఉంది. రెండు నెలల్లో బహుశా ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడుతుంది. ఈలోగా అసమ్మతిని చల్లార్చుకుందామనుకుని.. ప్రత్యక్షంగాను.. పరోక్షంగాను మూడు నియోజకవర్గాల్లో ఆయా పార్టీ కీలక నాయకులు ప్రయత్నాలు చేపట్టారు. కానీ బుజ్జగింపులు ఫలించలేదు. ఆమదాలవలస నియోజకవర్గంలో అయితే సీఎం పుట్టినరోజు వేడుకలు సైతం వేర్వేరుగా శిబిరాలు నిర్వహించి నాయకులు నిర్వహించారు. ఇక్కడి పార్టీలో సమస్యలను నేరుగా అధిష్ఠానం వద్దకు తీసుకువెళ్లారు స్వపక్షంలో విపక్షంగా ఉన్న నాయకులు. ఇప్పటికీ శాంతించలేదు. అలాగే ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గంలో ఫలానా అభ్యర్థి మాకు వద్దు.. జగన్ ముద్దు వంటి ప్రకటనలు, ఆందోళనలు చేయొద్దని పార్టీనుంచి ఆదేశాలు వచ్చినా అసమ్మతి నాయకులు పట్టించుకోవడం లేదు. వారిని నయానో భయానో దారికి తెచ్చుకుందామన్న ప్రయత్నాలు సైతం ఫలించలేదు. మూడో జాబితాలో ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాలు ఉంటాయని అందరూ ఊహించారు. కానీ ఊహించని విధంగా ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాలున్నాయి. సంక్రాంతి తర్వాతనైనా తాము చేస్తున్న ఆందోళనను పార్టీ పరిగణనలోకి తీసుకుంటుందో లేదోనని వైసీపీలో మరో వర్గం నేతలు ఎదురుచూస్తున్నారు. అభ్యర్థిని మార్పు చేయకపోతే తాము ఎటువైపు వెళ్లాలో అని సమాలోచనలు చేస్తున్నారు.



లారీ కింద పడి నుజ్జయిన మృతదేహాలు
ఇన్‌సెట్‌లో జన్ని లోకనాథం (ఫైల్)

పండక్కి ఇంటికి వస్తుండగా..

- లారీ ఢీకొని ఇద్దరి మృతి ● విశాఖపట్నంలో ఘటన
- కూర్మనాథపురం పంచాయతీలో విషాదఛాయలు

జలుమూరు(సారవకోట)/విశాఖపట్నం, జనవరి 12: పండక్కి స్వగ్రామానికి బయలుదేరిన ఇద్దరిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఉపాధి కోసం వెళ్లిన వారిద్దరూ ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా.. లారీ ఢీకొనడంతో మృతి చెందారు. విశాఖపట్నంలో ఈ ఘటన చోటుచేసుకోగా.. సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇందుకు సంబంధించి ఆరిలోవ ట్రాఫిక్ ఎస్.ఐ.శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీ మర్రిపాడు గ్రామానికి చెందిన కూర్మనాథపురం మీనా (30), అదే పంచాయతీ బంజీరుపేటకు గ్రామానికి చెందిన జెన్న లోకనాథం (25) ఉపాధి నిమిత్తం విశాఖ నగరానికి వచ్చారు. ప్రస్తుతం చినగదిలి హెల్త్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనంలో పనిచేస్తున్నారు. సంక్రాంతి పండుగకని శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వారిద్దరూ స్వస్థలానికి బయలుదేరారు. అయితే వీరి వాహనాన్ని జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో లారీ ఢీకొంది. దీంతో మీనా, లోకనాథం ఇద్దరూ వాహనం పైనుంచి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల కుటుంబాలకు పోలీసులు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కూర్మనాథపురం పంచాయతీ మర్రిపాడు, బంజీరు పేట గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- లోకనాథం తండ్రి కొన్నాళ్ల కిందట చనిపోయారు. ఆమె తల్లి చిరంజీవులు కుమారుడిపైనే ఆధారపడి జీవిస్తోంది. ఉపాధి కోసం వెళ్లిన కుమారుడు.. ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఇక తమకు దిక్కెవరంటూ లబోదిబోమని రోదిస్తోంది.
- మీనాకు తల్లిదండ్రులు అప్పలమ్మ, చలపతి ఉన్నారు. కుటుంబాన్ని పోషించే కుమార్తె మృతి చెందడంతో వారిద్దరూ కన్నీటి పర్యంతమవుతున్నారు. సంక్రాంతి వేళ తమ ఇంట తీరని విషాదం అలుముకుందని రోదిస్తున్నారు.

సంక్రాంతికి పస్తులే



బాలకృష్ణాపురంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

- ఉపాధి కూలీలకు రెండు నెలలుగా అందని వేతనాలు
- జిల్లాలో రూ.35కోట్లు బకాయిలు

(ఇచ్ఛాపురం రూరల్)

సంక్రాంతి అంటేనే గ్రామాల్లో ఆనందంగా సంబరాలు చేసుకుంటారు. మరో రెండు రోజుల్లో పండగ వస్తున్నా చేతిలో చిల్లిగవ్వ లేక ఉపాధి కూలీలు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. పని చేసిన వారం రోజుల తరువాత మరసటిరోజుకి వేతనాలు ఖాతాల్లో జమవుతాయని అధికారులు, పాలకులు చెబుతున్నారే తప్ప ఆచరణలో కనిపించడంలేదు. రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందకపోవడంతో పెద్ద పండగ చేసేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 3.84 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 6.20 లక్షల మంది ఉపాధిహామీ కూలీలున్నారు. వీరిలో ప్రస్తుతం 1.40 లక్షల మంది వేతనదారులు పనులకు వస్తున్నారు. రెండు నెలలుగా చేసిన పనులకు డబ్బులు రాక వారంతా నానా ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం రూ.35కోట్లు బకాయి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కూలీల వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతీ వారం మండల కార్యాలయానికి పంపుతారు. వారు చేసిన పనిని బట్టి ప్రతి సోమవారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన రెండు రోజులకు కూలీల ఖాతాల్లో నగదు జమవుతుంది. కాగా వివరాలు నమోదు చేసి నెలలు గడిచినా వేతనాలు చెల్లించడంలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటలు పండక, ఉపాధి డబ్బులు రాక ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. వేతనదారులను అన్ని రకాలుగా ఆదుకుంటామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వ పెద్దలు, అధికారులు తమ కష్టాలను పెడచెవిన పెడుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

పండగ పూటా అప్పులే



నేను నాలుగు వారాలుగా ఉపాధి పనులు చేస్తున్నాను. కూలి డబ్బులు ఈ రోజు, రేపు ఖాతాల్లో పడతాయని చెబుతున్నారే తప్ప ఇప్పటివరకు పడలేదు. దీంతో జీవనం కష్టంగా మారింది. పండగ పూట అప్పు చేయాల్సి వస్తోంది. అధికారులు వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలి.

- కోట నూకమ్మ, ఉపాధి కూలి, ఇచ్ఛాపురం మండలం

త్వరలో జమ చేస్తాం

ఉపాధి కూలీల వేతనాలకు సంబంధించి బిల్లులు నమోదు చేశాం. బకాయిలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు ఉన్నతాధికారులు తెలియజేశారు. కూలీలు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు. నాలుగైదు రోజుల్లో వారి ఖాతాల్లో జమవుతాయి.

- జీవీ చిట్టిరాజు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

ఇబ్బందులు పడుతున్నాం



ఉపాధి పనులు చేస్తున్నప్పటికీ కూలి డబ్బులు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పండగ పూట అప్పులు చేసి పిల్లలకు వస్త్రాలు కొనుగోలు చేసాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు సకాలంలో చెల్లించాలి.

- బోరుభద్ర వరలక్ష్మీ, ఉపాధి కూలి, ఇచ్ఛాపురం

బకాయిలు పేరుకుపోయాయ్!

- మొక్కుబడిగా ఇంటి పన్ను వసూలు
- జిల్లాలో రూ.33 కోట్లు పెండింగ్

(టెక్కలి)

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంచాయతీలకు చెందిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు, సీసీ చార్జీలు (వీధి దీపాల బిల్లుల బకాయి) దారిమళ్లించడంతో గ్రామ పంచాయతీలకు ఆదాయం కరువైంది. దీనికితోడు ఇంటిపన్ను శతశాతం వసూలు కాకపోవడంతో పంచాయతీల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. కార్యదర్శుల తాత్సారం, కొన్నిచోట్ల కార్యదర్శుల పోస్టుల ఖాళీలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడం, క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్ల మూలంగా ఇంటిపన్ను పూర్తిస్థాయిలో వసూలు కావడం లేదు. ఫలితంగా పంచాయతీల అభివృద్ధి అటకెక్కింది. జిల్లావ్యాప్తంగా రూ.33.44కోట్ల వరకు ఇంటి పన్ను బకాయిలు ఉన్నాయి. శ్రీకాకుళం డివిజన్‌లో బకాయిలు రూ.5.98కోట్లు, విద్యుత్ రూ.15.29కోట్లు, పలాస డివిజన్‌లో బకాయిలు రూ.1.36కోట్లు, విద్యుత్ రూ.3.75కోట్లు, టెక్కలి డివిజన్‌లో బకాయిలు రూ.1.69కోట్లు, విద్యుత్ రూ.5.37కోట్లు ఉన్నాయి. ఈ బకాయిల్లో ఎక్కువ ప్రభుత్వ కార్యాలయాలవే. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను శతశాతం ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉన్నా ప్రభుత్వ కార్యాలయాల మొండిబకాయిలు వలన అది సాధ్యపడడం లేదు. పంచాయతీలకు ఇంటిపన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పారిశుధ్య కార్యక్రమాలు, వీధిదీపాల నిర్వహణకు చెరో 15శాతం, సిబ్బంది జీతాలకు 30శాతం, రోడ్ల మరమ్మతులకు 20 శాతం, ఆరోగ్యం, విద్యకు ఐదుశాతం, తాగునీటికి 15శాతం నిధులు కేటాయించాలి. 8 శాతం నిధులు జిల్లా గ్రం థాలయ సంస్థకు సెస్ రూపంలో పంచాయతీ చెల్లించాలి. అయితే మేజర్, మైనర్ పంచాయతీల్లో ఇంటిపన్ను బకాయిలు పేరుకుపోయాయి. దీనిమూ లంగా పంచాయతీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీసం కాలువలు కూడా శుభ్రం చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ వివరణ కోరగా.. 'ఇంటి పన్నుల వసూళ్లకు కార్యదర్శులకు నెలవారీ లక్ష్యాలు విధించాం. గ్రామీణ ప్రాంతాల్లో జనవరి, మార్చి నెలల్లో ఇంటి పన్నులు పెద్దఎత్తున వసూళ్లవుతుంటాయి. దీనికోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామ'ని తెలిపారు.



నందిగాం: కర్లపూడి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

వివేకానంద జీవితం అనుసరణీయం

- ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, జనవరి 12: 'భారతజాతి గొప్పదనాన్ని విశ్వవ్యాప్తం చేసి, బోధనలతో యువతకు మార్గనిర్దేశం చేసిన స్వామి వివేకానందుని జీవితం అనుసరణీయం. ఆయన స్ఫూర్తితో యువత జీవితంలో ముందుకు సాగాలి' అని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సూర్యమహల్ జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'యువతలో శక్తిని మేల్కొలిపి.. వారిని విజయం వైపు నడిపించే వివేకానంద జీవితచరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. వివేకానందుడు కేవలం 39 ఏళ్ల మాత్రమే జీవించినా, సమాజానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. నేటి యువత చాలామంది మానసికంగా వెనుకబడుతున్నారు. వారు వివేకానందుని సూక్తులను అనుసరించాలి. స్వామి చూపిన మార్గంలో యువత నడిస్తే భారతదేశం ప్రపంచానికే తలమానికం అవుతుంది' అని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ వివేకానందుడి స్ఫూర్తితో యువత గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జామి భీమశంకరరావు, అంధవరపు సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి, అంధవరపు ప్రసాద్, సురంగి మోహనరావు, విజికె మూర్తి, పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు పాల్గొన్నారు.



వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు



సంతకాల సేకరణ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీల కోటి సంతకాల సేకరణ

అరసవల్లి, జనవరి 12: సమస్యల పరిష్కారం కోరుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తల రిలే నిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. సమ్మెలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద నిర్వహించిన శిబిరంలో కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి మాట్లాడుతూ.. సేకరించిన సంతకాలను సీఎం జగన్మోహన్‌రెడ్డికి పంపిస్తామని తెలిపారు. 32 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రాట్యుటీ ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును కూడా అమలు చేయకపోవడం అన్యాయమని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక నిరాహార దీక్షలు, చలో విజయవాడ చేపడతామని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వీజీకే మూర్తి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, హేమలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్

కలెక్టరేట్, జనవరి 12 : గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వేడుకలకు మైదానాన్ని సిద్ధం చేయాలని సూచించారు. 'తాగునీరు ఏర్పాటు చేయాలి. పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి. అభివృద్ధి, సంక్షేమ శాఖలు తమ ప్రగతిని తెలియజేసే శకటాల ప్రదర్శనలను ఏర్పాటు చేయాలి. పరేడ్‌కు పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు సమన్వయం చేసుకోవాలి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి' అని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. 19వ తేదీ నాటికి ప్రశంసా పత్రాల జాబితా అందజేయాలని స్పష్టం చేశారు. జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ వేదిక ఏర్పాట్లలో ఏ ఒక్కరికీ ఇబ్బంది ఉండరాదన్నారు. స్పీచ్ నోట్, తదితర ఏర్పాట్లపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, డీఆర్వో గణపతిరావు, ఆర్డీవోలు రంగయ్య ఉప కలెక్టర్ పద్మావతి, డీపీవో రవికుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు, ఏపీసీ జయప్రకాష్, డీఈవో వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఆర్డీవో గంగాధర్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ శాంతిశ్రీ, వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, సీపీవో లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్



సరుబుజ్జిలి: సుభద్రాపురంలో పర్యటిస్తున్న రవికుమార్



కంచిలి: బాబు ష్యూరిటీపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు



నరసన్నపేట: బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● జిల్లా వ్యాప్తంగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకుల ప్రచారం

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి నాయకుల ప్రచారం చేశారు. బాండ్లు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను వివరించారు.

● **సరుబుజ్జిలి:** రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ ప్రభుత్వాన్ని అంతం చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని, ప్రజాగ్రహంలో జగన్ ప్రభుత్వం భస్మీపటలం కావడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. శుక్రవారం సుభద్రాపురం, సింధువాడ, మూలసవలాపురం, వీరభద్రపురం గ్రామాల్లో ఆయ పర్య టించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిం చారు. టీడీపీ, జనసేన కలయికతో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. విజ్ఞులైన ఓటర్లు వచ్చే ఎన్నికల్లో ఆలోచనలతో రాష్ట్ర పునర్నిర్మాణానికి కృషి చేయాలన్నారు.

● **నరసన్నపేట:** రాష్ట్రాభివృద్ధికోసం సీఎంగా చంద్రబాబునా యుడు చేయాలని టీడీపీ నాయకులు ఉణ్న వెంకటేశ్వరరావు తెలిపారు. నరసన్నపేటలో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష, బలగ భారతి, మాజీ సర్పంచ్ ఉణ్న రాజశ్రీ, తెలుగు మహిళ అధ్యక్షురాలు పుచ్చల కల్పన పాల్గొన్నారు.

● **కంచిలి:** కొల్లూరు పంచాయతీలోని అరవసరియపల్లిలో టీడీపీ నాయకులు భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.రమేష్‌రెడ్డి, ఐటీడీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, రామారావు, లోకేష్ పాల్గొన్నారు.

ఎస్మాను ఉపసంహరించుకోవాలి

● అంగన్‌వాడీలు వినూత్ననిరసన ● 32వ రోజుకు చేరిన సమ్మె ● కోటి సంతకాల సేకరణ ప్రారంభం



నరసన్నపేట: ఉరితాళ్లు బిగించుకుని నిరసన



కోటబొమ్మాళి: ప్రాజెక్టు కార్యాలయం వద్ద ..



పలాసరూరల్: అంగన్‌వాడీల నిరసన

ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వానికి తగదని, తక్షణమే ఉప సంహరించుకోవాలని అంగన్‌వాడీలు డిమాండ్‌చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారంకోసం కోటి సంతకాల సేకరణను శుక్రవారం ప్రారంభించారు. సేకరించిన కోటి సంతకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పంపిస్తామని సీఐటీయూ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. 32 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో అంగన్‌వాడీలకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో కంటే అధనంగా వేతనాలు ఇస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దుచేసి అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సర్వీసులో చనిపోయిన కుటుంబంలో ఇకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. (ఆంధ్రజ్యోతి బృందం)



సారవకోటలో ధర్నా చేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఇచ్ఛాపురం: బోర్లా పడుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పాందూరు: సంఘీభావం తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

బీసీ ద్రోహి జగన్: బగ్గు



జలుమూరులో బీసీ జయహో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు: రాష్ట్రంలో బీసీల ద్రోహిగా జగన్మోహనరెడ్డి ప్రజానీకానికి గుర్తుండిపోయేలా తీరని అన్యాయంచేశారని నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం మండలంలోని అల్లాడ, తిమడాం, సైరిగాం, కొమనాపల్లి, జలుమూరుల్లో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జలుమూరులో నిర్వహించిన సమావేశంలో జయహో బీసీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బీసీలకు కార్పొరేషను చైర్మన్లుగా నియమించి కుర్చీలు లేకుండా చేసిన ఘనత జగన్మోహనరెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలమట సాగర్, వజ్జ బాబూరావు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, మునుకోటి దామోదరరావు, భైరి భాస్కరరావు, గురుబెల్లి ద్యూన్సీ, గుండ రామకృష్ణనందకిషోర్ పాల్గొన్నారు.

లగేజీ బ్యాగు ప్రయాణికుడికి అప్పగింత

పలాస: ఒడిశాలోని గంజాం జిల్లా కొరసండి గ్రామానికి చెందిన దుబ్బ సాయికుమార్‌కు చెందిన లగేజీ బ్యాగును ఆయనకు పలాస రైల్వే పోలీసులు శుక్రవారం అప్పగించారు.గురువారం సికింద్రాబాద్ నుంచి పలాస ఈస్ట్‌కోస్ట్ రైలులో సాయికుమార్ చేరుకున్నాడు. తన లగేజీ బ్యాగును రైల్వేస్టేషన్ బయటకు వచ్చే క్రమంలో పోగొట్టుకున్నాడు. అందులో రూ.50వేలు విలువైన వస్తువులు ఉండడంతో ఆయన వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదుచేశాడు. హెచ్‌సీ కోదండరావు ఆధ్వర్యంలో పోలీసులు స్టేషన్‌లో ఉన్న సీసీ ఫ్యూటేజీలు పరిశీలించారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద ఉండే ఆటో కార్మికులను సంప్రదించారు. వారు కూడా బ్యాగు కోసం ఆరాతీశారు. ఆటోడ్రైవర్ పెదగాపు మధు వెంటనే స్పందిస్తు బ్యాగును గుర్తించి పోలీసులకు అప్పగించాడు. ఈ మేరకు బాధితుడికి బ్యాగును ఆటో డ్రైవర్ల సమక్షంలో అప్పగించారు.

సమయపాలన పాటించాలి: డీఎల్‌పీవో

ఎల్.ఎన్.పేట: పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించి సక్రమంగా విధులను నిర్వహించాలని టెక్కలి డీఎల్‌పీవో ఐవీరమణ తెలిపారు. శుక్రవారం ఎల్.ఎన్.పేట మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీకార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగాఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆర్థిక వనరులు చేకూర్చుకోవాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం విడుదలచేసిన నిధులు గ్రామాల అభివృద్ధికి వినియోగించాలన్నారు. ఇంటిపన్నులు వసూలు, సుమిత్ర ద్వారా ఆర్థిక వనరులు చేకూరుతాయన్నారు. కార్య క్రమంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ పాల్గొన్నారు.

● **హిరమండలం:** ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని డీఎల్‌పీవో రమణ కోరారు. హిరమండలంలో కార్యదర్శులు, విస్తరణాధికారితో సమీక్షించారు. పంచాయతీ ఖాతాల్లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేస్తేనే తదుపరి నిధులు విడుదల అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఈవో నర్సింగరావు పాల్గొన్నారు.

జీతాలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

టెక్కలి: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆయా సంస్థలు జీతభత్యాలు చెల్లించకపోవడంతో సంక్రాంతికి పస్తులు తప్పవా అని ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య కార్మికులు, బోర్ మెకానిక్‌లు, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ పంప్ ఆపరేటర్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది, ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు, ఏపీ శాక్ పరిధిలోని పీపీటీసీ, ఐసీటీసీ కేంద్రాల సిబ్బంది, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు అందక పండగ ఎలా జరుపుకోవాలని సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందకపోవడంతో ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ఒక్కసారిగా ఆందోళనకు దిగారు.

పూర్వ విద్యార్థుల సందడి

వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో 1990-91లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం కలుసుకుని సందడిచేశారు. చదువుకున్నరోజుల్లో పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.అనాటిఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాలకు అవసరమైన సైకిల్‌స్టాండ్ కోసం రూ2లక్షల 50 వేలు విరాళంగా అందజేశారు.

వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోండి

నరసన్నపేట: హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులు వైరల్‌లోడ్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో ఎం. అనురాధ తెలిపారు. శుక్రవారం నరసన్నపేట సీహెచ్‌సీలోని ఏఆర్‌టీ కేంద్రాన్ని పరిశీలించారు కార్యక్రమంలో ఏఆర్టీ వైద్యాధికారి అప్పలనాయుడు, డిప్యూటీ పారా మెడికల్‌అధికారి సురేష్, సూపరింటె ఒడెంట్ జయశ్రీ పాల్గొన్నారు.

నేడు జాతీయ టెన్నీకాయిట్ ఫైనల్స్

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో శనివారం 47వ జాతీయ టెన్నీకాయిట్ ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు ప్రకటించారు. శుక్రవారం జరిగిన టీమ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పురుషుల విభాగంలో కేరళ, కర్నాటక,తమిళనాడు, పాండిచ్చేరి వరుస స్థానాల్లో నిలిచాయి. మహిళవిభాగంలో ప్రథమ స్థానాన్ని తమిళనాడు, ద్వితీయ పాండిచ్చేరి, తృతీయ కేరళ, నాలుగో స్థానాన్ని మహారాష్ట్రలు కైవసం చేసుకున్నాయి. డబుల్స్ క్వార్టర్స్ ఫైనల్స్ పోటీల్లో కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ చేరుకున్నాయి.

మద్యం దిగుమతికాకుండా చర్యలు: ఎస్పీ

మెళియాపుట్టి: ఒడిశామద్యం దిగుమతికాకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్‌లు ఎస్పీ రాధిక ఆదేశించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని వసుంధర చెక్‌పోస్టును శుక్రవారం రాత్రి తనిఖీచేశారు. ఒడిశా నుంచి వాహనాల రాకపోకలవివరాలు అడిగితెలుసుకున్నారు. ఆమె వెంట ఎస్ఐ రాజేష్ తదితరులు ఉన్నారు.

● **పాతపట్నం:** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటుచేసిన అంతర్ రాష్ట్ర సరిహద్దు సమీకృత చెక్ పోస్టును ఎస్పీ రాధిక తనిఖీచేశారు. ఆమెవెంట సీఐ సాయి, ఎస్ఐ మహమ్మద్ యాశిన్ ఉన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం

నరసన్నపేట: నరసన్నపేట గీతామందిరంలో ధనుర్మాసం పురస్కరించుకుని శుక్రవారం కూడారై ఉత్సవం వైభవంగా నిర్వహించారు.కూడారై పాశురాం చదువుతూ 108 పాత్రల్లో స్వామికి ప్రసాదం నివేదన చేసి వేడుకలను అర్చకులు పీసపాటి సూరిబాబు ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా గోదారంగనాథ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సర్వశిక్ష అభియాన్ సిబ్బందికి సాయం

టెక్కలి: సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఎంఆర్పీలు, సీఆర్పీలకు ఐదు నెలలుగా జీతాలు లేకపోవడంతో వారు చేస్తున్న సమ్మెకు యూటీఎఫ్, టెక్కలిశాఖ మద్దతు తెలుపుతూ ఆరువేల రూపాయలు వితరణగా అందజేసింది. ఈ కార్యక్రమంలో కె.దాలయ్య, వైకుంఠరావు, కుమారస్వామి, పాలవలస ధర్మారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'సామాజిక న్యాయానికి పెద్దపీట'

నరసన్నపేట: వైసీపీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజవర్గాల ఇన్‌చార్జిల కేటాయింపులో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. శుక్రవారం నరసన్నపేటలో కొత్తగా ప్రకటించిన నియోజవర్గాల ఇన్‌చార్జిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో పార్లమెంట్ నియోజవర్గ వైసీపీ ఇన్‌చార్జి తిలక్, ఇచ్ఛాపురం, టెక్కలి ఇన్‌చార్జిలు దువ్వాడ శ్రీనివాసరావు, పిరియా విజయ, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.

5కె రన్ పోటీలు

పలాస రూరల్: చినసీలావతి ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాస్థాయి 5కె రన్ పోటీలను నిర్వహించారు. మద్రిపాడు నుంచి నీలావతి వరకూ ఐదు కిలోమీటర్ల పరుగుపందెంలో బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందాల శ్యామసుందర్(లొహరిబంద), రాంబుడ్డి మహేష్(కొర్లాం), చల్లారాజు(శ్రీకాకుళం), కన్సోలేషన్ బహుమతులు సచ్చిసంతోష్(రాయపాడు),వి.భాస్కరరావు (పలాస), బాలికల విభాగంలో ప్రథమ,ద్వితీయ బహుమతులను ఉగ్రపల్లి అర్చన(పలాస), పాడి దీక్ష(పలాస) బహుమతులు సాధించారు. కార్యక్రమంలో వైద్యులు ఆనం ద్, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల సర్పంచ్‌లు గూడ గిరిజ, తామాడ మదన్, సైనిదేశయ్య, సంఘ ప్రధాన కార్యదర్శి చిన్నారావు,సభ్యులు కెప్రకాశరావు, గీతమ్మ, బాలరాజు, వినోద్,వ్యాపారవేత్త నాగరాజు పాల్గొన్నారు.

జనసేనలో 20 మంది చేరిక

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 22,25వార్డులకు చెందిన సురేష్, చిరు, ఆదర్శ, ముని, శ్రీహర్ష, దిలీప్, ప్రసాద్ తదితర 20 మంది యువకులు శుక్రవారం పార్టీ సమన్వయకర్త దుర్గారావు సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తామని తెలిపారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్రికెట్ జట్టు సభ్యులను అభినందిస్తున్న ఎంపీడీవో కాళీప్రసాదరావు

ఎల్.ఎన్. పేట: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు తెలిపారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో శుక్రవారం జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలో తురక పేట-కృష్ణాపురం గ్రామసచివాలయం నుంచి క్రికెట్ టోర్నీలో పాల్గొన్న టీకేపురం జట్టు మండలస్థాయిలో విజేతగా నిలవడంతో అభినందించారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న కమిషనర్

మెళియాపుట్టి: మెళియాపుట్టిలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని దేవదాయ శాఖకమిషనర్ సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ చరిత్ర, భూములవివరాలు అడిగితెలుసుకున్నారు. చరిత్రను పూజారి వివరించారు.

ఓట్లను తొలగించకుండా పరిశీలించాలి

నరసన్నపేట: అర్హులైనవారికి ఓట్లను తొలగించకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయపార్టీలతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆర్వో సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా తొలగించిన ఓట్ల వివరాలను అందజేయాలని రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో ఆర్వో జయదేవి, ఏఆర్వో సింహాచలం పాల్గొన్నారు.

పోర్టు వాహనాల నుంచి రక్షణ కల్పించండి

● అఖిలపక్ష రాజకీయ, ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్



సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

టెక్కలి: మూలపేట పోర్టుకు వెళ్లే భారీ వాహనాల నుంచి ఈ ప్రాంత ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని అఖిలపక్ష రాజకీయ, ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం టెక్కలిలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.కాగా అనంతరం టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్ట పురుషోత్తం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుబు కోత మధు, దళిత హక్కుల పోరాటసమితి నాయకులు యడ్ల గోపి, సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, బీజేపీ నాయకులు హనుమంతు ఉదయ భాస్కర్, కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు అనపాన షణ్ముఖరావు, సమతా సైనిక్‌దళ్ నాయకుడు చల్లా రామారావు, టీఎన్‌టీయూసీ నాయకులు నర్సింగరావు, కుప్పిలి కామేశ్వరరావు పాల్గొన్నారు.

పోర్టు వాహనాలతో ట్రాఫిక్ పాట్లు

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించిన వాహనాలతో టెక్కలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. శుక్రవారం టెక్కలి ఇందిరాగాంధీ కూడలిలో పోర్టు వాహనాలు రాకపోకల వల్ల ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. రోడ్ల పక్కన ఉన్న చిరువ్యాపారులు, సంక్రాంతి పురస్కరించుకుని పట్టణానికి కొనుగోలు చేసేందుకు వచ్చే వారంతా భారీ వాహనాలు చూసి భయపడతున్నారు.

గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

మెళియాపుట్టి: పెద్దమడి గిరిజనులకు గ్రామ సమీపంలో ఉన్న గ్రామకంఠంలో ఇళ్లపట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం నాయకులు కోరారు.ఈ మేరకు శుక్రవారం టెక్కలిసబ్‌కలెక్టర్ నూరుల్‌కమల్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రీసర్వే చేయించి భూములు గుర్తించి గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్వో జిల్లాఅధ్యక్షుడు సవరకుమార్, ఎన్‌టీఎఫ్ గేదెల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సంక్రాంతి సందడి

● కొనుగోలుదారులతో కిటకిట ● రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు

నరసన్నపేట/కాశీబుగ్గ: జిల్లాలోని శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస-కాశీబుగ్గజంటపట్టణాలు, ఇచ్ఛాపురం,పాతపట్నం మార్కెట్లల్లో సంక్రాంతి పురస్కరించుకుని శుక్రవారం సందడి నెలకొంది. వస్త్ర దుకాణాలతోపాటు, కిరాణా, ఫ్యాన్సీ, చెప్పులు దుకాణాలు కోనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. పండ్లు, కూరగాయలు, పువ్వులు కొనుగోలుతో మార్కెట్లో రద్దీ నెలకొంది. సంక్రాంతి పురస్కరించుకుని రూ.కోట్లల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు శుక్రవారం రద్దీగా మారాయి. కాశీబుగ్గ బస్టాండ్ ఎదురుగాఉన్న సంతకు వేలాది మంది జనాలు, వందలాది వాహనాలతో నిండిపోయింది. సంతకు ఉదయమే కొనుగోలుదారులు చేరుకున్నారు. సంక్రాంతికి అవసరమైన సామగ్రిని కొనుగోలుచేశారు. రైళ్లు, బస్సుల్లో ప్రయాణికులు పెద్ద ఎత్తున రావడంతో బస్టాండ్, సంత ప్రాంతాలు కిటకిటలాడాయి.



నరసన్నపేట: కోనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మెయిన్‌రోడ్డు


ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురం ఉన్నత పాఠశాలలో..


సారవకోట మండలం అలుదులో మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి..


శ్రీకాకుళం కల్చరల్: గాంధీ మందిరం వద్ద స్మృతివనంలో..


గార: కుమ్మరిపేటలో..

వివేకానందుడి ఆశయాలు కొనసాగిద్దాం

స్వామీ వివేకానందుడి ఆశయాలు ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం వివేకానంద జయంతి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వివేకానందుడి బోధనలు వివరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఎచ్చెర్ల: ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో..


ఇచ్ఛాపురం: పాత బస్టాండ్ జంక్షన్ వద్ద..


పొందూరు: తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాలలో..


అరసవల్లి: వివేకానందుని విగ్రహం వద్ద గొండు శంకర్


నరసన్నపేట: సమరసత సేవా సంఘం ఆధ్వర్యంలో..


నందిగాం: పెద్దతామరాపల్లిలో..


కవిటి: ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో..


కోటబొమ్మాళి: ఊడికలపాడులో..


టెక్కలి: నివాళులర్పిస్తున్న జనసేన పార్టీ నాయకులు


మెళియాపుట్టి: పెద్దపద్మాపురంలో..


లావేరు: జడ్పీ ఉన్నత పాఠశాలలో..


బూర్జ: కొల్లివలస జంక్షన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో..



జలుమూరు: శ్రీముఖలింగంలో ర్యాలీగా..

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్స్

కలెక్టరేట్: నిరుద్యోగ యువత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్లు ఇకపై ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాల సమాచారం ఈ వెబ్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేవారు విద్యార్హతలు, ఇతర ధ్రువ పత్రాలు ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకుంటే సరిపోతుందన్నారు. జేసీ ఎం.నవీన్, డీఆర్వో గణపతిరావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, టెక్కలి సబ్ కలెక్టర్ నూర్ కమల్, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, ఏఎస్పీ విఠలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌లో ఉద్యోగావకాశాలు

ఎచ్చెర్ల: నిర్మాణ రంగంలో నిరుద్యోగులకు ఇజ్రాయెల్ దేశంలో ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ తెలిపారు. ప్లాస్టరింగ్, సిరామిక్, టైల్డింగ్ ఫ్రేమ్‌వర్క్, ఐరన్ బిల్డింగ్ వంటి టెక్నాలజీపై ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. 21-45 ఏళ్ల వయసు కలిగి, 8వ తరగతి ఆపై చదివిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. భవన నిర్మాణ రంగంలో మూడేళ్ల అనుభవం తప్పనిసరి, బేసిక్ ఇంగ్లీష్ వచ్చి ఉండాలన్నారు. ఎంపికైన వారికి వసతి, వెళ్లేందుకు ప్రయాణ ఖర్చు, టాక్స్ మినహాయింపు తదితర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఆసక్తిగల వారు ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99888 53335 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

గోగు పంటపై రైతులకు శిక్షణ

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం గోగు, కట్టి జనుము పంటల్లో యాజమాన్య పద్ధతులపై శిక్షణ అందించారు ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనా స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు కె.సంధ్యారాణి, కె.భాగ్యలక్ష్మి, డి.శేఖర్, పి.అమరజ్యోతి, బి.స్వాతి, వై.రాజశేఖర్, జి.శ్రీనివాస్, జలుమూరు, బూర్జ మండలాలకు చెందిన రైతులకు సాగు విధానాలు చేపట్టాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

అరసవల్లి: నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ తప్పనిసరిని, గడువులోగా రెన్యువల్ చేయించుకోవాలని, స్కాన్ చేసిన ప్రతీ గర్భిణి వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, ఆన్‌లైన్‌లో వారి వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. నిబంధనలు పాటించంకుంటే మొదటి తప్పిదానికి మెమో జారీ చేస్తామని, రెండో తప్పిదానికి రూ.25,000 అపరాధ రుసుం, మూడో సారి సీజ్ చేస్తామన్నారు. అలాగే వైద్యుని రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేస్తామన్నారు. జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ పాటించాలని స్పష్టం చేశారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వ పథకాలును ప్రతీ ఒక్క అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. శుక్రవారం మెట్టవలస, పున్నాం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, దాసరధి పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

బూర్జ: చీడివలస గ్రామానికి చెందిన యాదవ కులస్థులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ వద్ద తమ సమస్యలు వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొల్లివలస జంక్షన్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో వారంతా ఆయన్ని కలిసి తమ సమస్యలు విన్నవించారు. 2019లో యాదవ కులానికి చెందిన 50 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ ఏ ఒక్కరికి మంజూరు చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో యాదవ కులానికి చెందిన 200 కుటుంబాలు టీడీపీతో ఉంటామని మా సమస్యలు పరిష్కరించాలన్నారు. రవికుమార్ స్పందించి నూటికి నూరు శాతం మీ సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ, కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

నవోదయ మోడల్ టెస్టుకు స్పందన

కంచిలి: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవోదయ మోడల్ టెస్టు స్పందన లభించింది. మొత్తం 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో ఎస్.శివరామ ప్రసాద్, చిట్టిబాబు, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు లండ బాబురావు, సభ్యులు పాల్గొన్నారు.

● **సోంపేట:** స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో నవోద మోడల్ పరీక్ష శుక్రవారం నిర్వహించారు. ఈపరీక్షకు 100మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. విజేతలకు యూటీఎఫ్ నాయకులు ఎస్.కూర్మారావు బహుమతులు అందజేశారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ఎచ్చెర్ల: ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి రోజూ కొంత సమయం వ్యాయమానికి కేటాయించాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నట్టయితే విధులు మరింత సమర్థవంతంగా నిర్వర్తించగలమని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గ్రీవెన్స్‌ను నిర్వమించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ టీపీ విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు కేఎస్ రావు, సీహెచ్ ప్రసాదరావు, ఆర్ఐలు, సాయుధ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కూడారై పూజలు

శ్రీకాకుళం కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా వివిధ ఆలయాల్లో కూడారై ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కూడారై వెల్లుమ్ పాశురాం చదువుతూ 108 వెండి గిన్నెల్లో స్వామివారికి చక్రపొంగళి నివేదన చేసి కూడారై వేడుకలు చేపట్టారు. నారాయణ తిరుమల, పాత శ్రీకాకుళం, చిన్నబజారులోని దూదివారి వెంకటేశ్వర స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కప్పేసిన కాటి చెరువు కాలువ


కప్పేసిన కాలువ

పొందూరు: రాపాక - అంబేడ్కర్ కూడలి రోడ్డులో ప్రభుత్వ స్థలాలే కాకుండా చెరువులు, కాలువలు కబ్జా చేస్తున్నారు. మండల కేంద్రంలో అతిపెద్ద చెరువుల్లో ఒకటైన కాటిచెరువు నీరు బయటకు తరలించే కాలువను (బట్టీ) కొంతమంది కబ్జాచేసి కప్పేశారు. వర్షాకాలం లో పట్టణంలోని నీరంతా కాటిచెరువుకే చేరుతుంది. దీంతో చెరువులో నిండిన నీరు పొలాల్లోకి వచ్చి నిలువ ఉండకుండా కాలువ ద్వారా రోడ్డు కింద నుంచి బయటకు వెళుతుంది. ప్రస్తుతం కాలువను కప్పేయడంతో నీరు వెళ్లే మార్గం లేక పొలాల్లోనే నిలువ ఉండిపోయే ప్రమాదం ఉంది. నీరు రోడ్డు మీదకు వెళ్లి కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. తక్షణమే అధికారులు కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుని తిరిగి కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వైద్య సేవలు వినియోగించుకోండి

కవిటి: నాణ్యమైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో మారుమూల పీహెచ్‌సీలను డాక్టర్ రెడ్డీస్ అభివృద్ధి చేస్తోందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ హెడ్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బొరివంక పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో అనురాధతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చీఫ్ ఆపరేటర్ ప్రవీణ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై దాడులు: గౌతు శిరీష


మాట్లాడుతున్న గౌతు శిరీష.

మందస: రాష్ట్రంలో బీసీ లపై దాడులు జరు గుతున్నా యని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తెలిపారు. శుక్రవారం మందస టీడీపీ కార్యాలయం ఆవరణలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమం త్రి జగన్ బీసీలకు తీవకన అన్యాయం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, కామేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు పరామర్శ

పలాస రూరల్: పెదంచలలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులను శుక్రవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గుమ్మడి నారాయణ తల్లి అప్పలమ్మ, ఉగ్రపల్లి సూర్యారావు భార్య హేమలతను కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, పోలాకి పాపారావు, ధనుంజయ, నర్సింహ ఉన్నారు.

వైసీపీ నేతలకు ప్రజలంటే గౌరవం లేదు: కలమట


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కలమట

పాతపట్నం: వైసీపీ నేతలకు ప్రజలంటే గౌర వం లేదని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి పేర్కొ న్నారు. శుక్రవా రం స్థానిక క్యాంపుకార్యాలయంలో టీడీపీ మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీసీనేతలంటే ముఖ్యమంత్రికి గౌరవంలేదన్నారు. . రాష్ట్రంలో అరాచక పాలనసాగుతోందన్నారు. అయన వెంట పార్టీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్యతోపాటు పలువురు పార్టీ నాయకులుశ్రేణులున్నారు.

టీడీపీలో చేరిన బాతుపురం వాసులు


పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: సోంపేట మండలం బాతుపురం గ్రామస్థులు ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వైసీపీ ప్రభుత్వంలో నిరాధరణకు గురయ్యామని గ్రామంలో సరైన అభివృద్ధి జరగకపోవడంతో టీడీపీలో చేరామని పలువురు తెలిపారు. వీరి చేరికలను కొంతమంది వైసీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేసినా ససేమిరా అంటూ రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకున్నారు. వీరికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రహ్మానందం, కృష్ణారావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీ సాధికారిత సాధ్యం


మాట్లాడుతున్న రామ్‌మల్లిక్‌నాయుడు

ఎచ్చెర్ల: బీసీ సాధికారిత టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. ఎచ్చెర్లలో శుక్రవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన పార్టీ టీడీపీ అని అన్నారు. టీడీపీ ఆవిర్భావంతో బీసీ వర్గాలకు చెందిన ఎంతో మంది ముఖ్య నేతలుగా ఎదిగారన్నారు. వైసీపీ సర్కారులో బీసీలకు సరైన గౌరవం లభించలేదన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, నాయకులు వావిలపల్లి రామకృష్ణ, అన్నెపు భువనేశ్వరరావు, పైడి ముఖలింగం, మెండ రాజారావు, మూకళ్ల భాస్కరరావు, బీసీ సాధికారిత కమిటీ సభ్యులు కొల్లి అప్పలనాయుడు, వెన్ని సన్యాసినాయుడు, గుజ్జాపు రాము తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-88లో టెన్త్ చదువుకున్న విద్యార్థులంతా అపూర్వ కలయిక జరిగింది. శుక్రవారం వారంతా పాఠశాలలో సందడిగా గడిపారు. ఆ నాటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన సూర్యనారాయణ, విశ్వనాథం మాస్టార్లను సన్మానించారు. కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు గోపి, లచ్చయ్య, హేమారావు, కల్యాణ్ చక్రవర్తి, రాజేంద్రప్రసాద్, రమేష్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో విద్యార్థులకు మేలు


మాట్లాడుతున్న రోణంకి గోపాలకృష్ణ

కంచిలి: వివేకానంద జయంతి సందర్భంగా పెద్దకొజ్జిరియా గ్రామంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్‌పోటీల్లో పూండి జట్టు విజేతగా నిలిచింది. శక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో 62 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి పూండి, రెండో బహుమతి కవిటి, మూడో బహుమతి లింబుగాం జట్లు సొంతం చేసుకున్నాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయవాడ డిప్యూటీ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. క్విజ్ పోటీలు విద్యార్థుల ఉన్నతికి దోహదపడతాయని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీపీ నిమ్మన దాసు, ఇప్పిలి కృష్ణారావు, కామేష్‌రెడ్డి, టీవీ రమణ, జామి జయ, సర్పంచ్ పొందల డిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

నీ హృదయమే శాంతి నిలయం

సోంపేట: ప్రపంచమంతా వెతికినా శాంతి దొరకదని, అది నీ హృదయంలోనే ఉంటుందని, నీ ఆత్మని నీ అధీనంలోకి తీసుకొని ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని ఓంశాంతి బ్రహ్మకుమారి వరలక్ష్మి, కుమారి కిరణ్మ ఉద్బోధించారు. శుక్రవారం కొర్లాం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


టెక్కలి: ఆదిత్యలో గంగిరెద్దుల విన్యాసాలు


ఎచ్చెర్ల: శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో..

సందడిగా సంక్రాంతి సంబరాలు

జిల్లాలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం సందడిగా నిర్వహించారు. సంప్రదాయాలు ఉట్టిపడేలా వస్త్రధారణ, విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. భోగి మంటలు వేసి ఆనందంగా గడిపారు.

- ఆంధ్రజ్యోతి బృందం


జలుమూరు: చల్లవానిపేటలో భోగి మంటలతో..

కబడ్డీ పోటీల విజేత పాలకొండ

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి రావికంటిపేటలో గత రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాలకొండ జట్టు విజేతగా నిలిచింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జిల్లా స్థాయి కబడ్డీ, రంగవల్లికల పోటీలు నిర్వహించారు. 32 కబడ్డీ జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో జీఎం పల్లి జట్టుపై పాలకొండ జట్టు విజయం సాధించింది. దీంతో ఆ జట్టుకు రూ.50 వేల నగదుతో పాటు ట్రోఫీ అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన జీఎం పల్లి జట్టుకు రూ.40 వేలు అందించారు. ముగ్గుల పోటీల్లో కొర్లకోట గ్రామానికి చెందిన పి.గౌతమి ప్రథమ స్థానం, రావికంటిపేటకు చెందన గౌతమి ద్వితీయ స్థానంలో నిలిచారు. రెండు రోజులుగా రావికంటిపేటలో సం క్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొని పార్టీలకు అతీతంగా సహకరించిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆర్థికసాయం

ఆమదాలవలస: మున్సిపాలిటీలో ఉన్న అన్ని విభాగాల సంఘ నాయకులు, ఉపాధ్యాయులు కలిసి ఎంఈవోలు జి.రాజేంద్ర ప్రసాద్, టి.రాజు సమగ్ర శిక్ష ఉద్యోగులకు శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో మానవతా దృక్పథంతో రూ.1.30 లక్షలు సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, ఉపా ధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



